క్లుప్తంగా

టేకు దుంగల పట్టివేత

సిరికొండ: సేవాలాల్ తండాలో రమేశ్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు దుంగలను ప్రత్యేక బృందం గురువారం రాత్రి పట్టుకుందని ఎఫ్ఆర్వో ఎం వినయ్‌నాయక్ శుక్రవారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు ప్రత్యేక బృందం తండాలో గాలింపులు చేపట్టగా 41 టేకు దుంగలు లభించగా వాటిని స్వాధీనం చేసుకొని పీఎస్‌కు తరలించినట్లు తెలిపారు. వీటి విలువ సుమారు రూ. 86 వేల వరకు ఉంటుందన్నారు. రమేశ్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రేషన్ బియ్యం..

సిరికొండ: గడ్కోల్ సమీపంలో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం రాత్రి పట్టుకున్నట్లు ఎస్సై ఎల్ రామ్ శుక్రవారం తెలిపారు. సిరికొండకు చెందిన షేక్ రియాజ్, ముధోల్‌కు చెందిన మహ్మద్ రిజ్వాను ద్దీన్‌లు ఆటోలో ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సిరికొండ నుంచి కొండాపూర్‌కు రైస్ మిల్‌కు తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అధ్యాపకుల నియామకానికి డెమో నిర్వహణ

నిజామాబాద్‌అర్బన్: మైనార్టీ సంక్షేమ శాఖలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో అధ్యాపకుల నియామకానికి సంబంధించి శుక్రవారం డెమో నిర్వహించారు. మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా కార్యాలయంలో శాఖ అధికారిణి కృష్ణవేణి ఆధ్వర్యంలో డెమో నిర్వహించారు. 20 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరికి డెమో నిర్వహించారు. ఇందులో ఉత్తమ ప్రదర్శన చేపట్టిన వారిని ఎంపిక చేస్తామని సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి తెలిపారు

రక్తదాన శిబిరం

నిజామాబాద్ నాగారం: రోటరీ క్లబ్ జేమ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహించి 25 యూనిట్ల రక్తం సేకరించి జీజీహెచ్‌కు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు పద్మ శ్రీనివాస్, రంజిత్ సింగ్ ఠాకూర్, కోశాధికారి కస్బ సంపత్ , క్లబ్ సభ్యులు రాం ప్రసాద్, నాగేశ్వరరావు, రాజశేఖర్‌లున్నారు.

డీఎల్‌పీవో ఆకస్మిక తనిఖీ

ఇందల్వాయి: చాంద్రాయణపల్లి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పరిధిలోని రూప్లనాయక్ తండాలో డీఎల్‌పీవో శ్రీనివాస్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో వస్తున్న డెంగ్యూ జ్వరాలపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రత, సానిటేషన్ గురించి స్థానిక మండల పరిషత్ ఆఫీసర్ రాజ్ కాంత్‌ని అడిగి తెలుసుకున్నారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలని ఆదేశించారు. మురికి కాలువలు వెంటనే శుభ్రపరచాలని గ్రామపంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. స్థానిక వైద్యాధికారి సంతోష్ ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఆరోగ్య కార్యకర్తలు సావిత్రి, ఉదయ, ఆనంద్ పాల్గొన్నారు.

ఖిల్లా ఫిల్టర్ బెడ్ పరిశీలన


నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఖిల్లా ఫిల్టర్ బెడ్‌ను శుక్రవారం సాయంత్రం మున్సిపల్ కమిషనర్ మకరంద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నీటి శుద్ధి విధానం పరిశీలించారు. రోజుకు ఎంతవరకు నీటి సరఫరా చేస్తున్నారు..ఎంతమంది సిబ్బంది అందుబాటులో ఉన్నారు..తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. తెలుసుకున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ



నిజామాబాద్ రూరల్: భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయూ 8వ అల్ ఇండియా మహాసభల సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో కరపత్రాలను జిల్లా సహాయ కార్యదర్శి దుద్దు గంగాధర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ ప్రభుత్వాలు ఏర్పడినా శ్రమజీవులకు కలిగే ప్రయోజనం శూన్యమన్నారు. సెప్టెంబర్ 1, 2 తేదీలలో పూణేలో జరిగే మహాసభలను జయప్రదం చేయాలని కార్మికులను కోరారు. నేతలు భీమ్‌సింగ్, నవీన్, రామకృష్ణ, కృష్ణంరాజు, సంపత్, ప్రశాంత్ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యోగులు ఉద్యమించాలి



నిజామాబాద్‌అర్బన్: హక్కుల సాధనకు ఉద్యోగులు ఉద్యమించాలని టీఎన్‌జీవోఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. శుక్రవారం టీఎన్‌జీవోఎస్ భవన్‌లో ఉద్యోగి కొట్టాల సత్యం పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఆయన మాట్లాడారు. త్వరలో ఉద్యోగుల పెండింగ్ సమస్యలపై రాష్ట్ర జేఏసీ మీటింగ్‌లో చర్చించి ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తామని, దీనికి ఉద్యోగ లోకం సమిష్టిగా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, టీఎన్జీవో కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు కస్తూరి వెంకటేశ్వర్లు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

- ప్రభుత్వ పథకాలు ఉపయోగించుకొని మహిళలు లక్షాధికారులు కావాలి
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతి రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని రూరల్ ఎమ్మెల్యే రేకుల పల్లి భూపతి రెడ్డి ఆకాంక్షించారు. శుక్రవారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో రూరల్ నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలు వారి స్వశక్తి, స్వయం కృషితో ఎదగడానికి రాష్ట్ర ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. మహిళా సంఘాల్లో లేని మహిళలను సంఘాలలో చేర్పించాలన్నారు. సంఘాలలో ఉన్న సభ్యులకు పాడి గేదెలు, పౌల్ట్రీ ద్వారా రుణాలు ఇప్పిస్తామన్నారు. అదేవిధంగా బ్యాంకుల ద్వారా ఇచ్చే రుణాలు త్వరగా మంజూరయ్యేలా చూస్తామని అన్నారు. ఐకేపీ, మహిళ సంఘాల ద్వారా వడ్ల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళలను ఆర్థికంగా ఎదిగే విధంగా చూస్తామన్నారు. ఉపాధి హామీ పథకంలో ప్రతి కూలికి 100 రోజులు పని కల్పించాలని వారికి రూ.200పైన కూలి వచ్చే విధంగా చూడాలని మళ్లీ మార్చి నెలలో సమీక్ష చేస్తానని అప్పటి వరకు టార్గెట్స్ కంప్లీట్ చేయాలని అన్నారు. మహిళ సంఘాల నాయకులు సీసీలు, వీవోఏలు పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఐడీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, డీఆర్‌డీవో సాయాగౌడ్, ఏపీడీ రవీందర్ రెడ్డి, సీసీలు, ఏపీఎంలు, ఎన్ఆర్ఐజీఎస్, ఎఫ్ఏలు, మహిళా సంఘ సభ్యులు తదితరులున్నారు.



పాల్గొన్న డీపీఎంలు, ఏపీఎంలు, వీవోఏలు, ఏపీవోలు, టీసీలు, టీఏలు, ఎఫ్ఏలు

ప్రతి బూత్‌లో 200 సభ్యత్వాలు చేయించాలి



మాట్లాడుతున్న పోతన్‌కర్ లక్ష్మీనారాయణ



మాట్లాడుతున్న సభ్యత్వ సహ ప్రముఖ్ సబిత

మోపాల్: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ప్రతి బూత్‌లో 200 సభ్యత్వం చేయించాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్‌కర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అధ్యక్షుడు ద్యాప రవి అధ్యక్షతన సభ్యత్వ నమోదుపై కార్యశాల నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన లక్ష్మీనారాయణ, రూరల్ నాయకురాలు సవిత వివరించారు. బీజేపీ మండల అధ్యక్షుడు రవికుమార్ మాట్లాడుతూ.. మండలం వ్యాప్తంగా బీజేపీ మరింత బలపడేలా సభ్యత్వ సేకరణ కార్యక్రమాన్ని చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రతి కార్యకర్త భాగస్వామ్యమై, అన్ని వర్గాల ప్రజలకు చేరువయ్యేలా ప్రతి ఒక్కరూ మరో వందమందిని సభ్యులుగా చేర్పించే విధంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో నేతలు నవీన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, మండల కిసాన్ మోర్చ అధ్యక్షులు గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో..

సిరికొండ: వచ్చే నెల 1 నుంచి ప్రారంభం కానున్న పార్టీ సభ్యత్వ నమోదును పకడ్బందీగా చేపట్టాలని బీజేపీ సభ్యత్వ సహప్రముఖ్ సబిత అన్నారు. మండల కేంద్రంలో సభ్యత్వ నమోదుపై అవగాహన సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి బూతులో 200కు తగ్గకుండా సభ్యత్వాలు చేయించాలని సూచించారు. పార్టీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రుమాండ్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి నక్క రాజేశ్వర్, ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీయూ నూతన కార్యవర్గం ఎన్నిక



ధర్పల్లి: మండల కేంద్రంలో శుక్రవారం సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ సంఘం(ఎస్‌జీటీయూ) కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులు జిల్లా కన్వీనర్ వెంకటరమణ, కో–కన్వీనర్ గంగాప్రసాద్ ఆధ్వర్యంలో ధర్పల్లి మండల ఎస్‌జీటీయూ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా న్యావనంది గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలిగా స్వాతి, కార్యవర్గ సభ్యులుగా శ్రీధర్, శ్రీనివాస్, ప్రవీణ్ రెడ్డి ఎన్నికయ్యారు. మండల అధ్యక్షుడు గంగాధర్ మాట్లాడుతూ.. ఎస్‌జీటీల సమస్యలపై పూర్తిస్థాయిలో పోరాడుతామని అన్నారు.

డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలి

– తహసీల్దార్‌కు పీడీఎస్‌యూ నేతల వినతి

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డిచ్‌పల్లి తహసీల్దార్ ప్రభాకర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్క గణేష్ మాట్లాడుతూ.. డిచ్‌పల్లిలోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలతో పాటు ప్రభుత్వ బాల, బాలికల వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలన్నారు. అలాగే ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని విన్నవించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ డిచ్‌పల్లి మండల అధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి రాజేష్, నాయకులు రాజు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో డైట్ సప్లై చేసిన గంగాధర్‌పై చర్యలు తీసుకోవాలి

నిజామాబాద్‌నాగారం: జీజీహెచ్‌లో డైట్ సప్లై చేస్తున్న గంగాధర్‌పై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని వై.శ్రీనివాస్ అనే వ్యక్తి కలెక్టర్ రాజీవ్ గాంధీని కలిసి శుక్రవారం విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజామాబాద్ జీజీహెచ్‌లో డైట్ సప్లై చేసే జి.గంగాధర్ అక్రమంగా తన పేరుతో డైట్ కాంట్రాక్టు నడిపిస్తున్నారన్నారు. పూర్తిగా తన ఆధారాలతో బిల్లులు క్లెయిమ్ చేస్తున్నారని చెప్పారు. నా సంస్థలో ఉద్యోగిగా ఉన్న గంగాధర్ నా పేరు మీద కొత్త సంస్థను తెరిచారని ఆరోపించారు. శ్రీనివాస్, భాగస్వామ్య సంస్థగా కొత్త పాన్ కార్డ్, జీఎస్టీ, ఇతర ఆధారాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ విషయాన్ని పరిశీలించి నాకు న్యాయం చేయాలని కోరారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న రసూల్‌బీ

నిజామాబాద్‌నాగారం: స్నేహ సొసైటీ స్వచ్ఛంద సంస్థ దివ్యాంగుల సంక్షేమం అభ్యున్నతి కోసం చేస్తున్న కృషి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ అన్నారు. శుక్రవారం నగరంలోని స్నేహ సొసైటీ ఫర్ రీ కన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అంధుల వనరుల పాఠశాలలో అంధ విద్యార్థుల తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా రసూల్‌బీ హాజరై మాట్లాడారు. స్నేహ సొసైటీ విద్యార్థులు దివ్యాంగులైనప్పటికీ ఆరోగ్యవంతులుగా ఉన్న పిల్లలతో సమానంగా పోటీ పడుతూ అన్ని రంగాల్లో రాణిస్తూ గుర్తింపు సంపాదించుకున్నారన్నారు. స్నేహ సొసైటీలో కావాల్సిన వసతులపై రాష్ట్ర కమిటీకి నివేదిక పంపిస్తామని అన్నారు. అలాగే అంధ విద్యార్థుల ఎయిడెడ్ పాఠశాల కోసం తమ వంతు బాధ్యతగా కృషి చేస్తానని తెలిపారు. దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించి రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మాజీ కార్పొరేటర్లు చంద్రకళ, మాయావర్ సాయిరాం మాట్లాడుతూ.. సేవాకు మారుపేరుగా నిలిచిన స్నేహ సొసైటీ గురించి ఎంత చెప్పిన తక్కువేనని అన్నారు. స్నేహ సొసైటీ ప్రిన్సిపాల్ జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ రాజేశ్వరి, కార్యదర్శి సిద్ధయ్య, జీవన్ రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహిళలపై వివక్ష పెరుగుతోంది



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు, నేతలు

నిజామాబాద్‌అర్బన్: ప్రస్తుతం మహిళలపై వివక్ష పెరిగిపోతుందని జిల్లా మహిళ సంక్షేమ శాఖ అధికారిణి రసూల్‌బీ అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కాలేజీలో శుక్రవారం మహిళలపై అత్యాచారాలు, భారత రాజ్యాంగంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చిన్న, పెద్ద తేడా లేకుండా స్త్రీలపై వివక్ష, అత్యాచారాలు పెరిగి పోయాయని అన్నారు. వీటి నుంచి రక్షించుకోవాలంటే మానసికంగా, శారీరకంగా ధృడంగా తయారుకావాలన్నారు. మహిళా చట్టాలు, టోల్‌ఫ్రీ నంబర్‌లపై అవగాహన ఉండాలని వాటి గురించి వివరించారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు నర్రా రామరావు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం మహోన్నత మైంది, దీని పీఠిక ఆత్మ లాంటిదని అన్నారు. అలాగే రాజ్యాంగంపై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కోయడ నర్సింలు, ప్రిన్సిపాల్ నరేష్, వెంకట మల్లయ్య, అనురాధ ఫార్మసీ హెడ్ వీరయ్య, శ్రీనివాస్, శ్రీరాం గౌడ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన 17 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్దిదారులకు రూ.3 లక్షల 40 వేల విలువగల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి మాజీ సర్పంచ్ నర్సారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్, నాయకులు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రైతులకు రుణమాఫీ చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నిజామాబాద్ రూరల్/నిజామాబాద్ అర్బన్: ఏకకాలంలో, ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రతినిధి బృందం సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో రైతు కూలీ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, కార్యదర్శి బి.దేవారం మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన తర్వాత 30 శాతం మంది రైతులకు మాత్రమే రుణం మాఫీ చేశారని అన్నారు. రైతు భరోసాకు ఈనాటికీ అతీ గతీ లేదని ఎద్దేవా చేశారు. పంటల బీమా ప్రీమియాన్ని ఇప్పటికీ చెల్లించలేదన్నారు. ఈ మేరకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. రైతు కూలీ ప్రతినిధి బృందం సభ్యులు పాల్గొన్నారు.

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ సురేష్

మోపాల్: గ్రామాల్లో పండుగలు శాంతియుత వాతావరణంలో జరుపుకుని పోలీస్ శాఖకు సహకరించాలని సీఐ సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం ఎస్సై యాదగిరి గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వినాయక మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతి తీసుకోవాలని, మండపాల వద్ద రాత్రి సమయంలో నిర్వాహకులు ఉండాలన్నారు. డీజేలకు అనుమతి లేదన్నారు. నిమజ్జనం రోజు మద్యం సేవించి ఊరేగింపులో పాల్గొనవద్దని సూచించారు. తహసీల్దార్ రామేశ్వర్, ఎంపీవో కిరణ్ కుమార్, ఏఎస్సై రమేష్ బాబు, వివిధ పార్టీల నాయకులు, మండపాల నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



నిజామాబాద్ రూరల్ : గూపన్‌పల్లి–గంగస్థాన్‌లో ఉన్న మహాలక్ష్మీ అమ్మవారికి శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని గూపన్‌పల్లికి చెందిన రాజేశ్వర్– స్వప్న దంపతులు రూ.50 వేల నోట్లతో అలంకరణ చేశారు. ఈ సందర్భంగా ప్రస్తుత శ్రావణ మాసంలో చివరి శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ కార్యక్రమం చేశామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.



ట్రాఫిక్ క్లియర్

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి దిన పత్రికలో గురువారం ఖలీల్‌వాడిలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించరూ.. శీర్షికన ప్రచురితమైన నేటి చిత్రం వార్తకు ట్రాఫిక్ పోలీసు లు స్పందించారు. ట్రాఫిక్ సీఐ వెంకట్‌నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఖలీల్‌వాడిలోని రోడ్డు పక్కన నిలిపిన కార్లను క్రేన్ సహాయంతో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొందరికి చలాన్లు విధించారు. ఆస్పత్రులు, దుకాణదారులు తప్పనిసరిగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

అధికార పార్టీ కనుసన్నల్లో పోలీస్ వ్యవస్థ



అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ

సుభాష్‌నగర్ : అధికార కాంగ్రెస్ పార్టీ కనుసన్నల్లో పోలీస్ శాఖ పనిచేస్తోందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో విమర్శించారు. రాజకీయాలకు సంబంధం లేకుండా స్వయం ప్రతిపత్తితో ప్రజలకు న్యాయం చేయాల్సిన పోలీస్ వ్యవస్థ అధికార పార్టీ నాయకులకు గులాంగిరి చేయడం సిగ్గు చేటని ఆరోపించారు. నగరంలో కొందరు సీఐలపై ఎన్నో అభియోగాలు, ఆరోపణలు వస్తున్నా ఎందుకు వారిపై చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. సీఐల బదిలీ ఉత్తర్వులు ఇచ్చి మళ్లీ ఆపడంపై ఉన్న మతలబు ఏంటో పోలీస్ కమిషనర్, ఐజీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థి అన్ని శాఖల్లో తలదూర్చడం వల్లే ఈ తంతు జరుగుతుందని మండిపడ్డారు. కొందరు అధికారుల కారణంగా మొత్తం వ్యవస్థకు చెడ్డ పేరు వస్తుందని, అలాంటి వారు నగరాన్ని వదిలి వెళ్లిపోవాలని సూచించారు. నగరంలో శాంతి భద్రతలపైన దృష్టి పెట్టకుండా రాజకీయ నాయకులకు గులాంగిరి చేస్తామంటే ఊరుకోబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు.

డంపింగ్ యార్డును సందర్శించిన కలెక్టర్



చెత్త శుద్ధి యంత్రాల పనితీరు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు

నిజామాబాద్‌అర్బన్ : జిల్లా కేంద్రంలోని నాగారం శివారులో గల డంపింగ్ యార్డును కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు శుక్రవారం సందర్శించారు. నగర పాలక సంస్థ పరిధిలో సేకరించే చెత్తను డంపింగ్ యార్డు వద్ద నిలువ చేస్తున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరు చేస్తూ, ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం యంత్రాల సహాయంతో శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. చెత్తను శుద్ధి చేసే ప్రక్రియలో పాల్గొంటున్న కార్మికుల భద్రత, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, వారికి అవసరమైన సేఫ్టీ కిట్లు అందించి వాటిని తప్పనిసరిగా వినియోగించేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ మకరంద్, సానిటేషన్ విభాగం అధికారులు ఉన్నారు.

పీఆర్‌టీయూ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కమిటీలో చోటు

నిజామాబాద్ అర్బన్: పీఆర్‌టీయూ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు చెందిన వసంతరావు నాయక్‌కు పదవి దక్కింది. సంఘం జనరల్ సెక్రెటరీగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర కమిటీలో నియమించినందుకు పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సడ్	160
		లైవ్	100
స్కిన్‌లెస్	200	మటన్	800

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	74,400	వెండి (కిలో)	90,200
22 క్యారెట్స్	68,635		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	12	24	గాజరుగడ్డ	30	50
బెండకాయ	15	30	పచ్చిమిర్చి	15	30
బీరకాయ	35	50	దోసకాయ	15	30
దొండకాయ	25	50	ఆలుగడ్డ	30	50
బీర్నీసుకాయ	50	70	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	80	120	కరివేపాకు	40	60
మెంతికూర	80	120	చామగడ్డ	40	60
కొత్తిమీర	150	200	గోరుచిక్కుడు	30	50
పుదీనా	50	75	చిక్కుడుకాయ	45	70
క్యాప్సికం	40	60			

– సుభాష్‌నగర్

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	సరిపోదా శనివారం(తెలుగు) -10.10, 1.15, 4.20,7.30, 10.40
స్క్రీన్-2	మారుతినగర్(తెలుగు)-10.30, కమిటీ కుర్రోళ్లు(తెలుగు)-1.30,10.30, డిమోంటికాలనీ-2(తెలుగు)-4.30, స్త్రీ-2(హిందీ)- 7.30
స్క్రీన్-3	ఆయ్(తెలుగు)-10.35, 4.30, 10.15, తంగలాన్(తెలుగు)-1.30,7.15

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	సరిపోదా శనివారం(తెలుగు)- 9.00, 12.30,4.00,7.30,11.00
స్క్రీన్-2	స్త్రీ-2(హిందీ)-12.00,3.15,6.30, 9.45
స్క్రీన్-3	కాలం రాసిన కథలు(తెలుగు)-10.05, కమిటీకుర్రోళ్లు(తెలుగు)--1.00,10.40, తంగలాన్(తెలుగు)-4.15, ఆయ్(తెలుగు)-7.35
స్క్రీన్ -4	డిమోంటికాలనీ-2(తెలుగు)-12.50 10.10, ఆయ్(తెలుగు)-3.55, మారుతినగర్ సుబ్రమణ్యం (తెలుగు)-7.00
దేవి	సరిపోదా శనివారం(తెలుగు)
నటరాజ్	తంగలాన్(తెలుగు)
విజయ్	కమిటీ కుర్రోళ్ళు (తెలుగు)
లలితామహల్	మిస్టర్ బచ్చన్(తెలుగు)